ప్రమాదాలకు నెలవు ఆ హైవే

- 516డి రహదారిపై తరచూ ప్రమాదాలు
- కానరాని హెచ్చరిక బోర్డులు




జంగారెడ్డిగూడెం - బుట్టాయగూడెం జంక్షన్ జాతీయ ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలోని జాతీయ ప్రధాన రహదారి ప్రమాదాలకు నెలవుగా మారింది. జంగారెడ్డిగూడెం పట్టణం మీదుగా దేవరపల్లి - తల్లాడ జాతీయ రహదారి 516డి వెళుతుంది. పట్టణం ప్రారంభమైన తరువాత నాలుగు ప్రధాన మార్గాలు రహదారిని తాకుతాయి. వాటిలో రెండు రహదారులు పట్టణం నుంచి అశ్వారావుపేట రోడ్డు వైపు, దేవరపల్లి రోడ్డు వైపు కలుస్తుండగా, మరో రెండు మార్గాలు ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రధాన మార్గాలు. ఈ 2 మార్గాలు జాతీయ ప్రధాన రోడ్డును దాటుకుంటూ ముందుకెళుతుంటాయి.

తరచుగా ప్రమాదాలు

జంగారెడ్డిగూడెం పట్టణం నుంచి బుట్టాయగూడెం వెళ్లేందుకు స్థానిక ఎస్సార్ బంక్ వద్ద జాతీయ రహదారిని దాటాల్సి ఉంటుంది. అలాగే రెడ్డిగణపవరం, గుబ్బల మంగమ్మగుడి తదితర ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లేందుకు శ్రీనివాసపురం జంక్షన్ రోడ్డును దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పలువురు మృత్యువాత పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రమాదాలకు చిరునామా..

పట్టణంలోని ఎస్సార్ బంక్ వద్ద ఉన్న బుట్టాయగూడెం జంక్షన్ ప్రమాదాలకు చిరునామాగా మారింది. ఇక్కడ పెట్రోల్ బంక్‌లు ఉండటంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుతున్నారు. జాతీయ రహదారి కావడంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయి. ఈ క్రమంలో బుట్టాయగూడెం జంక్షన్‌లో జాతీయ ప్రధాన రహదారిని దాటాలంటే పెద్ద ప్రహసనంగా మారుతుంది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచి ఉండటంతో అశ్వారావుపేట వైపు నుంచి గాని, దేవరపల్లి వైపు నుంచి గాని వాహనాలు వస్తుంటే అవి దగ్గరకు వచ్చేంత వరకు తెలియడం లేదు. దీంతో రోడ్డును దాటే క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు ఎక్కువ మృత్యువాత పడుతున్నారు. గతంలో బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వస్తున్న ఆర్టీసీ బస్సు సైతం రోడ్డు దాటే క్రమంలో ప్రమాదానికి గురైంది. ఇప్పటికైనా అధికారులు పటిష్ట చర్యలు తీసుకుని ప్రమాదాల నివారణకు, వాహనాలను రోడ్డు వెంబడి నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరతున్నారు.

ప్రమాద హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలి

జాతీయ ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రమాద హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలి. అవసరమైతే రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయాలి. ప్రధాన కూడలి కావడంతో నియంత్రణ చర్యలు తప్పక పాటించాలి. రోడ్డుకు ఇరువైపులా జిగ్‌జాగ్‌లు ఏర్పాటు చేసి వేగ నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఇమ్మణ్ణి నాగలక్ష్మి, జంగారెడ్డిగూడెం

ఫ్లై ఓవర్ నిర్మించాలి

పట్టణంలో జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా బుట్టాయగూడెం జంక్షన్‌లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు దాటే క్రమంలోనే ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నందున అధికారులు ప్రమాదాల నివారణకు ఈ ప్రాంతంలో ఫ్లై ఓవర్ ఏర్పాటు చేయాలి.

– కె.అమర్‌నాథ్, జంగారెడ్డిగూడెం

తహసీల్దార్‌ని సస్పెండ్ చేయాలి

జంగారెడ్డిగూడెం: సీపీఐ బుట్టాయిగూడెం మండలం కార్యాలయాన్ని కూల్చివేతకు కారణమైన తహసీల్దార్‌పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి, వెంటనే సస్పెండ్ చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు మన్నవ కృష్ణ చైతన్య, ఎం జీవ రత్నం, రామ్మోహన్, జంపన వెంకటరమణ రాజు, బాడిస రాము, నాగం అచ్యుత్, సూర్య చంద్రం, మునీశ్వరావు, ముత్యాలమ్మ, కుర్సం రామలక్ష్మి, తాళ్లూరి నాగరాజు, కలపాల శ్రీరాములు, వంగాగోపి, తదితరులు పాల్గొన్నారు.

జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న తహసీల్దార్ స్లీవజోజి

జంగారెడ్డిగూడెం: సంక్రాంతి సందర్భంగా జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.స్లీవజోజి హెచ్చరించారు. కోడిపందాల నిరోధానికి సంబంధించి రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులతో ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్, ఎస్సై, ఈవోపీఆర్‌డీ, మున్సిపల్ కమిషనర్లతో జాయింట్ యాక్షన్ కమిటీ నియమించామన్నారు. ఈనెల 8, 9 తేదీల్లో మండలంలోని ప్రతి గ్రామానికి తన ఆధ్వర్యంలో ఒక బృందం, ఈవోపీఆర్‌డీ ఆధ్వర్యంలో ఒకబృందం, జంగారెడ్డిగూడెం పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మరో బృందం పర్యటించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్సై షేక్ బజీర్ తన సిబ్బందితో పాల్గొంటారని తెలిపారు. కోడిపందాలు, గుండాట, పేకాటలు నిర్వహిస్తే చట్టప్రకారం శిక్షార్హులని, కోడిపందాల బరులు ఏర్పాటుకు సహకరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై షేక్ జబీర్ మాట్లాడుతూ ఇప్పటికే కోడిపందాల నిర్వాహకులు, సహకరించే వారిని బైండోవర్ చేశామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమాల షెడ్యూల్ ఇలా..

తహసీల్దార్ ఆధ్వర్యంలో 8వ తేదీన ఎ.పోలవరం, తాడువాయి, వేగవరం, మైసన్నగూడెం, అక్కంపేట, పట్టెన్నపాలెం, 9న శ్రీనివాసపురం, గుర్వాయిగూడెం, చక్రదేవరపల్లి, పుట్లగట్లగూడెం, దేవులపల్లి సచివాలయాల వద్ద, ఎంపీడీఓ ఆధ్వర్యంలో 8న నాగులగూడెం, పేరంపేట, పంగిడిగూడెం, లక్కవరం, తిరుమలాపురం, కేతవరం, 9న టెక్కినవారిగూడెం, నిమ్మలగూడెం, అమ్మపాలెం, కట్టవపాదలగూడెం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో 10న మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు.

యథేచ్ఛగా పందుల సంచారం



చింతలపూడి మసీదు వీధిలో సంచరిస్తున్న పందులు

చింతలపూడి : స్థానిక నగర పంచాయతీలో పందుల బెడదతో ప్రజలు సతమతమవుతున్నారు. పట్టణం నడిబొడ్డునే పందులను పెంచుతుండడంతో అవి రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రి, మెయిన్‌బజారు, ముస్లిం వీధి, జీబీజీ రోడ్డు, పాత బస్టాండ్, మారుతీనగర్, గణేష్ కాలని, గాంధీ నగర్, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ తదితర ప్రాంతాల్లో పందులు సంచరిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నాయి. వీధుల్లో, డ్రెయిన్లలో పందులు తిష్టవేయడంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. ఈనేపథ్యంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భాయందోళన చెందుతున్నారు. రాత్రి సమయాలల్ల యజమానులు పందులను గుంపులుగా తోలుకొచ్చి మారుతీనగర్, ఎస్‌వీఎస్ కాలనీ, మోడల్ కాలనీ ప్రాంతాల్లో విడిచి పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. యజమానులపై చర్యలు తీసుకోవాలని, పందుల పెంపకాన్ని ఊరికి దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే నగర పంచాయతీ అధికారులు అనేక పర్యాయాలు వీటి యజమానులను సమావేశ పరిచి, నోటీసులు జారి చేసి హెచ్చరించినా ఫలితం ఉండటం లేదు.

క్షేత్ర వీధుల్లో ఊరేగిన శ్రీవారు



తొళక్క వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి, తొళక్క వాహనంపై క్షేత్ర వీధుల్లో ఊరేగారు. తొలుత ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, విశేష పుష్పాలంకారాలు చేశారు. పూజలు చేసి హారతులిచ్చారు. అనంతరం స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజ గోపురం మీదుగా క్షేత్ర వీధులకు పయనమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, అశ్వ, గజ సేవల నడుమ శ్రీవారి ఊరేగింపు అట్టహాసంగా సాగింది. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు విశేష పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

పాముకాటుతో మహిళ మృతి



ఆశాజ్యోతి (ఫైల్)

కొయ్యలగూడెం: పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన కొయ్యలగూడెంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఎస్సీ కాలనీకి చెందిన ఆడమెల్లి ఆశాజ్యోతి (35), భర్త చిరంజీవి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కొయ్యలగూడెంలో సోమవారం ఆశాజ్యోతి కూలి పనికి వెళ్లగా, మధ్యాహ్నం సమయంలో బ్యారన్ పుల్లల్లో ఉన్న పాము ఆమె తలపై కాటు వేసింది. స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి, అనంతరం ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందింది.

ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేయాలి



ఫొటో, వీడియోగ్రాఫర్ల ఆత్మీయ సమ్మేళనం

బుట్టాయగూడెం: ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని జంగారెడ్డిగూడెం ఫొటో, వీడియో గ్రాఫర్ల అధ్యక్షుడు మద్దిరెడ్డి రవీంద్రకుమార్ కోరారు. ఆ సంఘ ఆత్మీయ సమ్మేళనం బుట్టాయగూడెంలోని కరాటం కృష్ణమూర్తి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ తమ అసోసియేషన్‌కు ప్రభుత్వం కమ్యూనిటీ హాల్, కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాగురే చిత్రపటాలు, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వై.సూరిబాబు, కార్యదర్శి సీహెచ్ జగన్, కోశాధికారి సీహెచ్ ప్రసాద్, గౌరవ సలహాదారులు డి.చండీశ్వరరావు, కె.సోమరాజు, కె.బాలు, పలు మండలాలకు చెందిన ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

మండల సమావేశం మూడోసారి వాయిదా



పోలవరం మండల పరిషత్ సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

పోలవరం రూరల్: పోలవరం మండల పరిషత్ సమావేశం మూడోసారి వాయిదా పడింది. పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ సుకర వెంకటరెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పూర్తిస్థాయిలో మండల స్థాయి అధికారులు హాజరు కాలేదు. పీసా చట్టంపై ఎన్నికలు నిర్వహణకు ఎన్నికల అధికారులుగా వెళ్లడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సమస్యలను ఎవరికి చెప్పాలంటూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అధికారులు మరోసారి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జీసీహెచ్ ప్రభాకర్, మండల పరిషత్ ఏఓ సీహెచ్ శ్రీనివాసబాబు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కోడి కత్తులతో నలుగురి అరెస్ట్



కోడి కత్తులు, నిందితులతో పోలీసులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం సెంటర్‌లో మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేస్తుండగా, ద్విచక్ర వాహనంపై కోడి కత్తులు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. వీరితోపాటు కోడికత్తులు సానపట్టే మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. వీరి నుంచి సుమారు 500 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కోడి కత్తులను పదును పెట్టే పరికరాలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ దాడిలో సిబ్బంది బాలకృష్ణ, రాంప్రసాద్, ఖలీల్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.

17 గ్రామాల్లో పీసా ఎన్నికలు ఏకగ్రీవం



దొరమామిడిలో అధ్యక్ష కార్యదర్శులకు నియామక పత్రం అందిస్తున్న అధికారులు



గడ్డపల్లిలో సభ్యులకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

బుట్టాయగూడెం: మండలంలోని మొత్తం 20 గ్రామాల్లో పీసా ఎన్నికలకు ఏర్పాటుచేయగా, మంగళవారం 17 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీమైనట్టు ఎంపీడీఓ ఎం జ్యోతి తెలిపారు. వీటిలో గాడిదబోరులో కార్యదర్శికి మాత్రమే ఎన్నికలు నిర్వహించామన్నారు. మిగిలిన గ్రామాల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పదవులకు ఎన్నికలు జరిగినట్టు చెప్పారు. బుట్టాయగూడెం, అచ్చియ్యపాలెం, తెల్లంవారిగూడెం గ్రామాలకు సంబంధించి కోరం లేకపోవడం వల్ల ఎన్నికలు వాయిదా వేశామన్నారు. దొరమామిడి గ్రామంలో వైస్ ప్రెసిడెంట్‌గా ముచ్చిక కృష్ణ, కార్యదర్శిగా కొమరం నాగార్జున ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం పట్ల సర్పంచ్ తెల్లం రాముడు అభినందనలు తెలిపారు. ఎన్నికైన వారికి ఎన్నికల అధికారి తెల్లం బాబూరావు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జె.కిరణ్‌కుమార్, ఏఐకేఎంఎస్ నాయకులు ధర్మల సురేష్, మాజీ సర్పంచ్ కొమరం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: పోలవరం మండలం చేగొండిపల్లి, గడ్డపల్లి పంచాయతీ పరిధిలోని 9 గ్రామాల్లో పీసా చట్టం ఎన్నికలు నిర్వహించారు. గడ్డపల్లి పంచాయతీలో ఎన్నికైన అభ్యర్థులకు ఎన్నికల అధికారిగా ఎంపీడీఓ ఈఎస్ శ్రీనివాస్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. పీసా చట్టం అమలుకు సభ్యులు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

కారు ఢీకొని 8 గొర్రెలు మృతి



ధ్వంసమైన కారు ముందు భాగం



మృతి చెందిన గొర్రెలు

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి జాతీయ రహదారిపై మంగళవారం కారు ఢీకొని ఎనిమిది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో మూడు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం. భీమడోలు మండలం అంబరుపేట పంచాయతీ కొండ్రెడ్డినగర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన గొర్రెల మందను గుణ్ణంపల్లి పరిసర ప్రాంత పొలాల్లో మేపి, సాయంత్రం ఇంటికి తోలుకెళుతున్నాడు. గుణ్ణంపల్లి వద్ద రోడ్డు దాటుతున్న గొర్రెలను ఏలూరు వైపు నుంచి రాజమండ్రి వైపుకు అతివేగంగా వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 8 గొర్రెలు మృతి చెందగా, మరో మూడింటికి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం దెబ్బతింది. ప్రమాదానికి కారణమైన కారును స్థానికులు చుట్టుముట్టారు. సమాచారం అందుకున్న ద్వారకాతిరుమల పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

క్లుప్తంగా

పాఠశాలలో సంక్రాంతి సందడి



పరమాన్నం వండుతున్న ఉపాధ్యాయులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో వారం రోజులకు ముందే సంక్రాంతి సందడి ప్రారంభమైంది. పాఠశాలలకు ఈ నెల 10 నుంచి సంక్రాంతి సెలవుల నేపథ్యంలో మంగళవారం మండలంలోని తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేశారు. పరమాన్నం వండారు. విద్యార్థులు హరిదాసు కీర్తనలు, జంగమదేవర వేషధారణలతో సందడి చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వసుంధరమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలో భక్తుల సందడి



మద్ది అంజన్న ఆలయంలో భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మంగళవారం కావడంతో మద్ది అంజన్నకు అర్చకులు విశేష పూజలు చేశారు. భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ.90,948 సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

జాబ్ మేళాలో 16 మందికి కొలువులు



నిరుద్యోగ యువతను ఇంటర్వ్యూ చేస్తున్న ప్రతినిధులు

కామవరపుకోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో తడికలపూడి మహిళా ప్రాంగణంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు హాజరైన 45 మందిలో 16 మంది వివిధ కొలువులకు ఎంపికైనట్టు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్ జితేంద్ర బాబు తెలిపారు. హోమ్ కేర్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా ప్రాంగణం మేనేజర్ బి.రిబాకా శామ్యూల్, సిడెప్ జేడీఎం పార్థసారథి, జిల్లా ప్లేస్మెంట్ అధికారి కె.ప్రవీణ్, కోఆర్డినేటర్ కార్తీక్ పాల్గొన్నారు.

ప్లేట్లు, బాక్సుల పంపిణీ



చిన్నాలకు కంచాలు, గ్లాసులు పంపిణీ చేస్తున్న సీడీపీఓ తులసి

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల అటవీప్రాంత గ్రామాలైన రేగులపాడు, రేపల్లెలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని కొండరెడ్డి చిన్నారులకు బుట్టాయగూడెం ఐసీడీఎస్ సీడీపీఓ ఇ.తులసి మంగళవారం గ్లాసులు, ప్లేట్లు, బాక్స్‌లు పంపిణీ చేశారు. గర్భిణులకు కంచాలను అందజేశారు. సీడీపీఓ తన సొంత ఖర్చులతో వీటిని సమకూర్చారు. ఆమెను సర్పంచ్ కారం లక్ష్మి, న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవలు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సతీష్, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త గురుగుంట్ల పద్మ, గ్రామస్తులు గురుగుంట్ల గోపి, కృష్ణారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపండి

ఏలూరు(మెట్రో): పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణతలో రాష్ట్రంలో ఏలూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు విద్యార్థులను సమాయత్తం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని 249 ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూళ్లోని పదో తరగతి విద్యార్థులతో మార్చి నెలలో నిర్వహించే పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన అంశాలపై ముచ్చటించి, విద్యార్థుల్లో ఉన్న పరీక్షలంటే భయాన్ని పోగొట్టి, వారిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 23 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. టీవీలు, ఫోన్లకు దూరంగా ఉండి టెక్స్ట్ బుక్స్‌తోపాటు విజయకేతనం మెటీరియల్‌ను అభ్యసించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. అనంతరం కుక్కునూరు ట్రైబల్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపేందుకు ఆదేశాలిచ్చారు. డీఈఓ వెంకట లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి : చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో సారా శిబిరాలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. నాగిరెడ్డిగూడెంకు చెందిన జరపాల మంగ అనే మహిళ నుంచి రెండు లీటర్ల సారాను, తలార్లపల్లి గ్రామంలో దేశావాతు చక్రధరావు నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని సీఐ పి.అశోక్ తెలిపారు. నాగిరెడ్డిగూడెం గ్రామ శివారులో 300 లీటర్ల బెల్లం ఊట, టి.నరసాపురం మండలం వల్లంపట్ల గ్రామ శివారులో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. సారా కేసుల్లో నిందితులైన మంగ, చక్రధరరావు, అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావులను తహసీల్దార్ ముందు హాజరుపర్చి బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఈఎస్‌టీఎఫ్ సీఐ ఆర్ సత్యవతి, ఎస్సై ఎండీ ఆరీఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఫణి కుమార్, ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీ ఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



ఇటికలకోట అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు అడుగుతున్న ప్రత్యేక అధికారి ప్రభాకర్

పోలవరం రూరల్: పోలవరం మండలం ఇటికలకోట అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి జీసీహెచ్ ప్రభాకర్ పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థుల సంఖ్య, వారికి అందించే పౌష్టికాహారం తయారీ, విద్యార్థుల నుంచి పౌష్టికాహారం అందించే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రగడపల్లి, చేగొండిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన పీసా చట్టం ఎన్నికల సమావేశాన్ని ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

- పొగాకు రైతులకు సూచన
- జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా



వర్జీనియా వేలం కేంద్రంలో మాట్లాడుతున్న బాషా

కొయ్యలగూడెం: పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌కే హబీబ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో ఏలూరు జిల్లా స్థాయి సమావేశం ఏడీఏ పి.బుజ్జిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. హబీబ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని వర్జినియా రైతులకు దిశా నిర్దేశం చేశారు. ప్రపంచ మార్కెట్లో వర్జీనియా సాగు ఒడిదుడుకుల మధ్య నడుస్తోందని, ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఇతర వాణిజ్య పంటల సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె.కస్తూరి కృష్ణ పొగాకు బదులు మొక్కజొన్న, నూనె గింజల పంటల గురించి రైతులకు వివరించారు. పొగాకు వేలం నిర్వహణాధికారి గ్రేసి మార్గరేట్, రాజమండ్రి ఏరువాక సీనియర్ సైంటిస్ట్ సీహెచ్‌వీ నరసింహారావు, వ్యవసాయ అధికారులు, పొగాకు వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.